చిత్రవధ!

శ్రీ ఏలూర్చారి విజయ రాఘవరావు

డబ్బున్నవాళ్ళ పిల్ల.

చీకూ చింతా ఎరగని చిన్నప్పట్నుంచీ మితిలేని గారాబం, పరిమితి లేని స్వేచ్ఛలతో పెరుగుతూ, కళ్ళెం లేని గుర్రంలా కాలంతో చిందులాడుతూ, ప్రతిచోటా ప్రణయ సల్లాపాలతో 'గుస' 'గుస'లాడే యౌవ్వనపు రోజుల్లో, కళంటే చెవి గోసుకునే పరివర్తనొచ్చిందెందుకో హటాత్తుగా!

ఆమే కమల....

నోరు తెరిస్తే కవిత్వం పొంగినట్టే, గీత గీస్తే చాలు- అందాలుట్టిపడే వర్ణచిత్రమై కూర్చుంటుందీ అబ్బాయి కుంచె మహిమేమిటో మరి!

అతనే రవి....

ఆ తర్వాతేం జరిగిందో 'పేద్ద' కథకుణ్ణడగఖర్లా. పసి పిల్లల్నడిగినా చెప్తారు.

కమల రవిని ప్రేమిస్తుంది. పెద్దవాళ్ళ కిష్టం లేకపోయినా పెళ్ళి జరిగి తీరుతుంది. ప్రణయలీలల్లో నాలుగు రోజులు స్వర్గంలా గడిచిపోతాయి. తర్వాత జీవిత సమస్య లొకటొకటే బైటపడి కళ కతీతమైన కఠోర ఘట్టాలు ఘటిస్తాయి నిత్య జీవితంలో. బ్రతుకు లోతుపాతులకు భయపడ్డ భీరువులు కష్టాల సమస్యా పూరణానికి మరణమే అంతిమ సాధనమని భ్రమిస్తూ, మందు తినో, గంగలో దూకో, రైలుకింద పడో - వినరాని విపత్తులకు పాలై - లోకంనుంచి పారిపోతారు శాశ్వతంగా. పోతూ పోతూ బ్రతికున్నవాళ్ళ జీవితాల్లో ఘోరమైన విశ్శబ్దాన్ని గుప్పించి మరీ పోతారు!

అల్లాగే జరిగింది పాపం!

కమల పోయింది!

రవి బ్రతికుండీ కూడా జీవన్మరణాన్ననుభవిస్తున్నాడు! పశ్చాత్తాపంతో పరితప్తుడై, మైనంలా కరిగిపోతున్నాడు ప్రతి క్షణం!

తప్పు తనదే. ఒప్పుకుని తీరాలి...

కళాసృష్టిలో మునిగి తానై వలచి వచ్చిన అర్ధాంగినికి, ఇరవైనాలుగు గంటల్లో కనీసం కొన్ని ఘడియలైనా - ఆమె సంతోషం కోసం - వెచ్చించలేకపోయ్యాడు రానూ రానూ! అనుకున్నదొకటీ - అయిందొకటీ! శ్రీమంతుల కుటుంబంలోంచి, చిరాకు నరకంలోకి స్వయం దూకి తన్నుతాను శృంఖలాబద్ధం చేసుకున్నట్టు ఘుటనతో కుంగి కృశించి, లోకం గాఢనిద్రలో వున్న ఒక అర్ధరాత్రి, లోకంతోనే తెగతెంపులు చేసుకుంది కమల....

* * *

భార్య చనిపోయిన తర్వాత, అతనికి స్వంత వూళ్ళో కాలు కదపడాని కిష్టం లేకపోయినా, వున్న వూరు వదలడానికీ మనస్కరించలేదు, మరో వూళ్ళో సరికొత్త జీవితానికి 'ఓ' 'నా' 'మా' లు దిద్దడానికి ధైర్యం చాలక....

కమలను గురించి అల్లిన కల్పనా కథలన్నీ మరిచినట్టు శాంతిని పొందాడామె ఆఖరు క్షణాల్లో. కానీ - తనదిగా చలామణీ అవుతున్న పదార్థమేదో తనకు దూర దూరంగా తొలిగిపోతూ, శూన్యంలో అంతర్లీనమౌతున్నట్టు పీడకలలు కంటూ భయపడడం పరిపాటీ అయిపోయిందీమధ్య. పేము బెత్తాలతో తమ చేతిని తామే చిరుదెబ్బలు చరుచుకుంటూ తీవిగా పోతున్న సోల్జర్లను చూసీ చూడనట్టు సాయంత్రం రోడ్డుపక్కన నడుస్తుంటే, వారి జీవితాల్లోని సూటీతనమైనా తన కబ్బలేదేమో అన్న సందేహం మాటిమాటికీ స్ఫురించేది! చివరిసారిగా చిత్రం గీసి, అన్ని బొమ్మలకూ 'వాఖ ఇది'గా చిచ్చుపెట్టి, తనూ శాంతంగా మరో లోకంలోకి మరుగుపడిపోదామనుకుంటాడు అప్పుడప్పుడూ.... అసలు "తన చిత్రాలెవరిని ఉద్ధరించడానికో?" అని మాత్రం తనెప్పుడూ ఆలోచించని విషయం....

గది ఊడ్చి, మూడు దినాలైంది. దహన సంస్కారాల తర్వాత తంతు కోసం వొచ్చిన బ్రాహ్మలను "వొద్దు"ని పంపించేశాడు. సంక్రాంతి చలి వొణుకొస్తున్నా, తన చిత్రాలకు మట్టికడ్డం కప్పిన పాత కంబళీ తను కప్పుకోడు! కమల లేని

కొంపలో - వరదా మూలగా - మసి పూసుకున్న దీపపు సెమ్మాను తుడిచి వొత్తి వెలిగించడానికైనా బద్ధకం వేస్తుందిప్పుడు! వీధి లాంతరు దగ్గర చదువుకుంటూ ఒక రాత్రంతా గడిచిపోయింది. మరో రాత్రి సాయంత్రం అయిదింటికే నిద్రపోయాడు! పోతే- ఓ రాత్రి ఇంటికే రాలేదు! ఇదీ, జీవితపు వాలకం...

తల్లినీ, తండ్రినీ, చెల్లాయినీ చూస్తూ చూస్తూ 'నావీ' అని చెప్పుకోదగ్గ నాలుగు గోడల మధ్య గడిపిన జీవితాన్ని మరిచే, దాదాపు పది సంవత్సరాల పైబడింది. ఇల్లు విడిచిందెప్పుడో, ఎల్లాగో, అసలు జ్ఞాపకం చేసుకోదల్చుకోడెప్పుడూ.

కమలతో తొలి పరిచయం రోజున, ఇప్పుడు తనుంటున్న గది గోడమీద గీసిన 'ఉషాకన్య' బొమ్మలో ముద్దుగా పొదిగిన తన పేరు చూచుకుని, పెద్దమనుషులో, పేరున్న కళారాధకులో తనకోసం వస్తారని తనకు ఆశ లేదు. వీధి చివరి బడిలోంచి వొఖ్ఖ పసివాడైనా "మామయ్యా! నా బొమ్మ గియ్యావూ?.... మావా! ఇవ్వాళ నేనూ, రోహిణీ, ఇద్దరం కూచుంటాం.... కలిపి వెయ్యాలేం'' అంటూ తనకోసం వస్తే, అదే తన జీవితాశయంలా- వొయ్యారంగా, ఫలవృక్షంలా - నేలకొరుగుతూ కుంచె అందు కుంటాడు! బడిలో చదివే పిల్లలందరి బంధువులూ రవికి పరిచితులే. ఒకటో అరో, ప్రతి యింట్లో తన చిత్రం వుంటుంది. అమ్మినవి కావు.... పిల్లలకు పంచిపెట్టినవి."

వీధి మలుపులో జమీందారుగారి కట్టడం చుక్కల్ని లెక్క పెడుతున్నది. "నా చిత్రం, నా పేరూ ఆ కట్టడంలో హంస తూలికా తల్పాల సహవాసం చేస్తున్నాయి. మరి నేనెక్కడ తలదాచుకున్నా జీవితం నడవదా యేవిటి?" తరచు తన్ను తాను ప్రశ్నించుకుంటాడతను. కొన్నాళ్ళు సుఖనిద్రకదే కారణం. కానీ - జంతువులు నివసించ నిరాకరించే గృహ పరిసరాల్లో భవ్య సౌందర్యాన్ని భావించుకుంటూ చిత్రాలు గీస్తూ, చిత్ర విచిత్రంగా జీవితనౌకను ఒడ్డు దాటిస్తున్నాడంటే ఆశ్చర్యమే!

ఖచ్చితంగా చెప్పాలంటే, జమీందారుగారి ముద్దు మనవడి శిష్యత్వం అక్కరకొచ్చిందన్నమాట. కృష్ణదాసుగారి పుణ్యమా అంటూ, వెళ్ళినప్పుడల్లా 'భోజనం పెట్టమని' వంటవాళ్ళను పురమాయించారు. "ఎప్పుడూ ఇక్కడికే వస్తున్నా"డని, వంట వాళ్ళు జమీందారుగారితో చెప్పినట్టు లేదు. ఇది కారణంగా రవికి భోజనం గొడవ లేదనలేం. రాత్రి వంటవాడు రొట్టెలో కూర వేస్తుంటే 'ఫెళ్ళు'న మెదడులో ఒక గడ్డుప్రశ్న గుచ్చుకొస్తుంది. "ఇవ్వాళ అమ్మా, నాన్నా, యీ కూరకు నోచుకున్నారో లేదో!"__

అరిటిపండును పాయసంతో నంజుకుంటూ అనాలని పిస్తుంది "పాపం! ఇది కమలకు మహా యిష్టం!"

వంటింట్లోంచి చేతులు కడుక్కొని వీధిలోకి వచ్చినా, ఆనాటి వంటకాలన్నీ, నిజజీవితంలోని అభావాల నేదో ఒక రకంగా గుచ్చి గుచ్చి గుర్తుకు తెస్తాయి! కొన్నాళ్ళుగా దీని అర్థం ఊహించుకోడం అసంభవమౌతోందతనికి!

భోంచేశాక కొంప చేరుకుని గది తాళం తీస్తున్నాడు. గొళ్ళెపు సందులో కనపడిందో కాయితం ముక్క. తీసి, చదువుదామనుకుంటూనే, సిగరెట్ పీక ముట్టిస్తూ, పరధ్యానంగా ఆ కాయితం ముక్కను జేబులోకి తోసేశాడు!

ఆనాడు పసివాళ్ళు నేర్చుకుంటూ గీసిన చిత్రాలు దిద్దుతూ దిద్దుతూనే నిద్రొచ్చేసింది. రాత్రి కమల కలలో వచ్చినట్టు స్ఫురించినా, అద్దంలాంటి ఆమె వర్చస్సును, కలగా తోసిపుచ్చ డానికి మనసొప్పలేదు. రెపరెప లాడుతున్న కనురెప్పలు రుద్దు కుంటూ, సిగరెట్ పెట్టె వెతుకుతూ, మరో అరుణోదయం ప్రారంభమైంది. తొమ్మిది గంటలైనా మిట్ట మధ్యాహ్నంలా మండుతోంది బైట.

మనసుకు తగ్గ మంథనలే యీ కాలం తీరు! ఎక్కడ చూసినా క్రౌర్యం!

పోలీసుల కాల్పుల వద్దడి!! పక్క వీధిలోనే! పట్టపగలే!

ఇది నిత్యకృత్యాల్లో ఒక అంగంలా తయారైంది గనక "రోజూ చచ్చేవాళ్ళకు యేడ్చేవాళ్ళెవ" రన్నట్టు, రవికీ ఆలజ డంతా అలవాటే!

తుపాకీ దెబ్బలకు వొణుకుతూ, ఇంట్లో, బూజు పట్టున్న కమల పటం "ధభీ''మని పడి ముక్కలు ముక్కలైంది!!

మెల మెల్లగా కారుతున్నా కన్నీటి బొట్లు... సన్నగా కదిలినై రవి పెదిమలు "దీపం ఆరిపోతుందా ఎప్పుడైనా.... రెపరెపలాడీ ఆడీ అనంత తేజస్సులో కలిసిపోతుందంటే...."

* * *

"రవీ మామా.... తాతయ్యొళ్ళారిప్పుడే.... భోంచేద్దాం రాండి" పరిగెత్తబోయే, జమీందారుగారి మనవణ్ణి, పరాకుగా

చూస్తూ గొణిగాడు రవి "అరే! ముఖమైనా కడగలేదే! మళ్ళీ భోజనం!"

కాలకృత్యాలు తప్ప, ముగించదగ్గ పనులేమీ కనిపించవు రవికి కొన్నాళ్ళు! ముగించడం విధి - పొద్దు గడవదు గనక! బడి సెలవుల్లో పిల్లలు గూడా రావడం అరుదు. ఆటల్లో మునిగిపోతారు వాళ్ళ వాళ్ళిండ్లల్లో. అసలు తన శిష్యబృందం ఎవరెవరి తాలూకు పిల్లలో కూడా తెలీని, కాలానికి లొంగిన అమాయకుడు రవి!

అన్నట్టు - ఆనాడాదివారమైనా రామూ, రోహిణీలు మరీ మరీ చెప్పిపోయారు 'వస్తామని'. వాళ్ళ చిత్రం పూర్తయినా 'మౌంట్' కొనడానికి జేబులో 'పైసా' కూడా లేదివ్వాళ! ఏం చెయ్యడం!?

ఫోంచేస్తూ వంటవాడ్నడిగాడు "నర్సింహులూ! కృష్ణ బాబుగారెప్పుడైనా అవసరం వస్తే మీకు అదనపు డబ్బులిస్తారా?"

"హా!! వడ్డీతో సహా జీతంలో మినహాయించుకున్నారు మొన్న మా అక్క పెళ్ళికి తీసుకున్న అప్పుకింద! పై మాటలే బాబూ! ఏమో మీరడిగితే చెప్పలేం.... ఆయన ముద్దుమనవడి గురువుగారు గదండీ మీరు!

డబ్బు విషయంలో "రవైనా, నర్సింహులైనా జమీందారు గారికేమాత్రం భేదం లేదన్న" నిర్ణయం తనది. గొడ్డులా ఇంట్లో రాపవళ్ళు వండి పెడ్తున్నందుకు నిజానికి నర్సింహులుకే ఎక్కువ ఆదరణ చూపవచ్చేమో!

"ఛీ.... ఏం అడక్కపోతే...."

స్ఫురించిన భావాలకూతంగా సిగరెట్ ముక్క వెతుక్కుంటూ చెయ్యి జేబులో కెళ్ళింది. "కరెన్సీ"లా నునుపుగా తట్టిన కాయితం ముక్క ఆధాట్టుగా తీశాడు.

"రవీ! నమస్తే. మీకోసం వచ్చా. మీరు రాలేదింకా. మీరు మా చెల్లికీ, తమ్ముడికీ ఇచ్చిన చిత్రాలు చూశా. మురిసిపోయానంటే నమ్మండి. నేర్చుకోవాలని వుంది. మళ్ళీ వచ్చి మాట్లాడతాను. క్షమించి, రేపు ఇంట్లో వుంటారు కదూ!

సెలవు. శాంత"

గొళ్ళెంలో దొరికిన కాయితం ముక్క! చదవడానికిప్పుడు తీరిక దొరికింది! - (దొంగలుబడ్డ వారం రోజులకు కుక్కలు మొరిగినట్టు!) మాచక్కని లెటల్ హెడ్! క్షీరసాగరంగారి కుమార్తె కాబోలు. రాచవాళ్ళమ్మాయి. ఏమైనా విచిత్రమైన జీవితమే తనది. కానీ జేబులో లేకపోయినా కలవాళ్ళతోనే స్నేహితం చీటికీ మాటికీ!

దూరంగా దిష్టిబొమ్మలా కూలబడ్డ తన గదివైపు చూపులు మళ్ళించాడు. ఎవ్వరూ ఎదురు చూస్తున్నట్టు లేదు.

"ఆమె ఇవ్వాళ రాదేమోలే!"

గొళ్ళెం తీస్తుంటే మరో కాయితం ముక్క విరాజమానమైంది! ఏమిటీ ట్విస్ట్!!

"ఎక్కడికి కెళ్ళారో తెలీదు. మళ్ళీ ఆలస్యమైంది. ఆలయానికి పోను కారు వచ్చింది. ఇప్పుడే వెళ్ళి తీరాలి. కనీసం రేపన్నా ఇదే సమయానికి శ్రమనుకోకుండా ఇంట్లో వుండండి.

నమస్తే. శాంత"

గొళ్ళెం కబుర్లు నెమరువేసుకుంటూ తలుపు తీస్తున్నాడు!

"రవీ మామా! మేం వచ్చేశాం"

వెనక్కు తిరిగాడు రవి. ఇమిడీ ఇమడని బొత్తాలతో కొత్త సూటూ గౌనూ తొడుక్కుని హాజరయ్యారు. రామూ, రోహిణీ. "ఇస్తా"నన్న చిత్రం తీసుకుపో "వస్తున్నా"మని ముందే చెప్పించారు గనక.

రోహిణిని ముద్దు పెట్టుకుంటూ అన్నాడు రామూతో "బజార్లో మౌంట్లన్నీ అయిపోయాయ్రా. మీ చిత్రం రెడీ. ఆనక మళ్ళీ వెళ్ళి మౌంట్ కొని, ఫ్రేమ్ పూర్తిచేసి ఎంచక్కా మీ యింట్లో స్వయం నే యిచ్చిపోతా. కోప్పడకండేం!"

"ఊహూ!!"

ఏకగ్రీవంగా నిరాకరించారు రామూ, రోహిణీ.

"ఇదుగో,మా అక్కయ్యిచ్చిన రూపాయ్ నోటు. ఇప్పుడే కొనుక్కుందాం పదండీ.... అవెక్కడ దొరుకుతయ్యో మాకు తెలుసు కూడా...."

పసివాళ్ళ చెవులు గిల్లుతూ "సరే పదండం"టూ బయల్దేరబోతున్నాడు రవి.

ఇంతలో వెనకనుంచి శబ్దం "రామూ! రోహిణీ! ఎప్పుడూ ఆదే పనా? సగం కాలం మీవల్లనే వృథా అవుతున్నట్టుంది వారికి. పొండి. అమ్మ ఆపిల్సు కొన్నది మీకోసం."

సొంత కారు శబ్దం కొత్తగాకపోయినా బెదురుగా వెనక్కు తిరిగి చూశారు పిల్లలిద్దరూ. సిగరెట్టు ముక్క వెలిగించబోయే

అగ్గిపుల్లను దాచేస్తూ గుమ్మం దగ్గరగా నుంచున్నాడు రవి. తన పాత కొంపలో విరిగిన కిటికీల గాజు ముక్కల్ని ముద్దుబెట్టుకుంటున్నట్టు మరీ దగ్గరగా నుంచున్న కారులోని వెనక సీట్లోకి రామూ, రోహిణీ గంతు వేశారు "నారాయణా! కార్ పోనీ. అక్కయ్య కోసం మళ్ళీ వద్దువుగానిలే"

కారు కదిలించాడు డ్రైవర్ నారాయణ. సగం దూరం పోయాక అడిగింది రోహిణి "అక్కయ్యెందుకొచ్చిందీ? మమ్మల్ని వెతకడానికా?

"కాదమ్మా. చిత్రాలు గియ్యడం నేర్చుకోడానికి"

* * *

"చూడండీ! నేను చిత్రలేఖనం నేర్చుకోడానికొచ్చాను"

"అల్లాగే"

"మరి పరీక్షిస్తారా?"

"అల్లాగే"

"బయట మీ "ఉషాకన్య" చిత్రాన్ని కాపీ చెయ్యమన్నారా?"

"ఊ"

శాంతకీ అర్ధాక్షరాల జవాబులు నచ్చలేదు. 'కొత్త' కావడం వల్లనేమోనని సమర్థించుకుని గీస్తోంది చిత్రాన్ని.

"పాపం! కమల పోయిందిట కదూ! విన్నాను. మొన్న భాష్యంగారన్నాడు"

"ఊ"

వింటూన్నప్పుడు, ఏ ఆలోచనలో వున్నాడో ఆమె గ్రహించలేకపోయినా, భాష్యం పేరు వినగానే రవి మూతి ముడుచుకున్నట్టు స్ఫుటమైందామెకు. అతను కమలకు తమ్ముడుగా జన్మించినందుకు రవి ఎన్నిమార్లో చింతించిన మాట నిజం.

అందచందాలతో, శ్రీమంతుల కుటుంబంలో పుట్టినా, అనుకోకుండా తనలాంటి బీద చిత్రకారుణ్ణి అందల మెక్కించినట్టు, తన జీవితంలోకి రావడాన్ని "యవ్వనాంధకారంతో, చేసిన తిక్కపనిలా" లోకమెంత ఆడిపోసుకున్నా - పాపం! ఆశ్చర్యజనకమైన సౌశీల్య ప్రవర్తన కమలది! అలాంటి కమలకు, భాష్యం, "తమ్ముడం"టే నమ్మలేం! డబ్బూ, హోదా చూసి లోకులెంత పొగడినా భాష్యంలాంటి గోముఖ వ్యాఘ్రాలను దరిజేరనివ్వడు రవి. కారణం, అభిరుచులు భేదించడం మాత్రమే కాదు; అసత్య జీవనాన్ని అసహ్యించుకోవడమే....

* * *

మళ్ళీ అడిగింది శాంత

"వింటున్నారా? మీ "ఉషాకన్య" చిత్రాన్ని కాపీ చేస్తున్నా...."

పరధ్యానంగా అన్నాడు రవి.

"ఊ ... చెయ్యండి చూద్దాం...."

పూర్తిచేసింది చిత్రాన్ని, విచిత్రంగా శాంత! చుక్క కూడా పొల్లుపోలేదు!

"నిజానికి, మూలంకన్నా ఇదే బాగుందేమో!" లోలోపల ఆమె సామర్థ్యాన్ని శ్లాఘిస్తూ, తొణకకుండా అనుకున్నాడు రవి....

"రోజూ నేర్చుకోడాని కొస్తారుగదూ?"

మురిసిపోయింది శాంత. "అల్లాగే. అభ్యంతరం లేకపోతే...."

"........."

"మరి సెలవా?"

"ఊ"

గుమ్మం దాటి కిటికీవైపు ఓరచూపు చూస్తూ, మళ్ళీ పలకరించింది శాంత "రామూ, రోహిణీవాళ్ళ మొంట్బు వేనివ్వడు కొని తీసుకురానా?"

"తొందరేంటి. రేపు చూద్దాంలేండి"

"....చిత్రలేఖనానికి....... నెల కెంతివ్వాలో తేలిస్తే బావుంటుంది"

"మొంట్లకు సరిపడ ఇస్తే చాలు"

కారు తలుపు తెరుస్తూ ఫక్కున నవ్వింది శాంత.... "భావకవి!"

* * *

"నారాయణా! నాకోసం ఎవరైనా వచ్చారా మనింటికి?"

"భాష్యంగారమ్మా. రోహిణమ్మగారితో మళ్ళీ వస్తానని చెప్పినట్టుందమ్మా"

"సరే. పద త్వరగా"

వేగంగా కదులుతున్న కారు చక్రాల మరుపిడికి రేగిన దుమ్ము పొరలు పొరలుగా పక్కనే సాగిపోతోంది. దొంగనిద్ర పోతూ మెల్లమెల్లగా ప్రపంచాన్ని మింగుతున్న కాలం కంట్లో పీడకలల్లా ఎక్కడెక్కడో జరుగుతున్న హత్యలూ, మానభంగాలూ విరిసిస్తూ కాబోలు - గుట్టలు గుట్టలుగా సుడిగాలికి ఎండుటాకులు రాలుతున్నై. దరిద్రుడి నుదుటి రేఖల్లో చెదిరిన కురుల్లా, పోలీసు కాల్పుల రక్తం మరకలింకా 'బిక్కు' 'బిక్కు' మంటున్నాయా రోడ్డుమీద.

దూరంగా వీధి మలుపులో వెనక్కు తిరిగి చూసింది శాంత, కారు అద్దంలోంచి పరాకుగా. శిలా ప్రతిమలా నుంచునే వున్నాడింకా రవి!

కృష్ణాంబుద చ్ఛాయల్లో 'ధళుక్కు'న విద్యుల్లతలు వెలగడం సృష్టి వైచిత్ర్యమే. కాంక్షాకాంతులు స్పృశించని జీవితాలకు, రెప్పపాటులో నవ్య జ్యోతులను చూడగలిగే ఆశ పొటమరించడం అనూహ్యమేమో! కానీ నివురుగప్పిన నిప్పులో ఉష్ణత సాంతం పుడిగిపోయిందనలేం.

మట్టి మసకపొరలను చీల్చుతూ పరిగెత్తిన కారువైపు చూస్తూనే నుంచున్న రవి నివ్వెరపోతూ అనుకుంటున్నాడు-

"కళామూర్తి ఆమె!!"

* * *

శాంత ఇల్లు చేరుకున్న కాసేపట్లో భాష్యంగారొచ్చారు. తన మేనమామకు దూరబంధువనో, బాగా డబ్బున్నవాడనో, కాస్త గౌరవంగా చూస్తారతన్ని శాంత యింట్లో. అయితే— అతన్నర్థం చేసుకున్న ప్రత్యణువూ అతని దరిజేరడానికి నిరాకరిస్తుంది! అర్థం చేసుకోనివ్వడమే అరుదు! అదే అతని చాకచక్యం! వేసాకుకు చక్కెర పులిమి అందించగల విధానాలెన్నో తెలుసతనికి!

అడిగిందామె "బాబూ! మీ ఎగ్జిబిషన్ మాటేవిటీ?"

"దాన్ని గురించి మాట్లాడ్డానికే వచ్చా. వచ్చే మాసానికి సిద్ధమౌతుంది. పట్నం వెళ్ళి అనేకుల ఆర్థిక సహాయం లాక్కొచ్చా. మరి నీ చిత్రాలు తయారా శాంతా?"

"అడిగారు గనక చెబుతున్నా. రవి గీస్తున్న అద్భుత శైలి ముందర, నా చిత్రాలు దిష్టిబొమ్మల్లా కనిపిస్తున్నయ్ నాకు! నే నేర్చుకోడం మళ్ళీ 'ఏ' 'బి' 'సి' దగ్గర్నుంచీ మొదలెట్టానంటే నమ్ముతారా? - అదిసరే రవిగార్ని చిత్రాలిమ్మని అడిగారా?"

ఒక్కసారి భాష్యంగారి ముఖకవళికలు మారిపోయా యెందుకో! "హుఁ!! అంత లోటుగా కనిపిస్తే నేనే గీస్తాను. అతణ్ణడగడం అసంభవం...."

ఎటో యెటో పోతున్న భ్రమరాలు పరిమితిలేని పరిధుల్లో వెతుక్కుంటూ దూరదూరపు గులాబీల నాశ్రయించి ఆఘ్రాణిస్తాయి. అనతిదూరంలో కుప్పిగంతులు వేస్తున్న కూపస్థ మండూకాని కవగతమే కాదా సువాసన! రవిలాంటి ఉత్తమ కళాబ్రహ్మ తమ మేడల నీడల్లో పరాకుగా పచారులు చేస్తుంటే, "కాద"ని తోసిపుచ్చి, అందని మానిపళ్ళు కాసించడంలో, భాష్యంగారు పొందే ఆనందం శాంత కర్థంకాలేదు. అసలీ నాటకం రంగభంగం కావడానికి కమల నిష్కృతే కారణమేమో! భాష్యం గారికి చిత్రకళంటే తలా తోకా తెలీకపోయినా, తద్వారా నాల్గు రాళ్ళు చేసుకునే మంత్రమతవికి కరతలామలకం! ఇప్పటికెన్నో పెయింటింగ్ ఎగ్జిబిషన్లు చేయించాడు - జేబులు నింపుకోడానికే గాని, కళలో ఆసక్తివల్ల మకరాం కాదని అందరికీ తెలిసిన విషయమే! కాపీ లేని కళాకారుణ్ణే కమల వరించడంతో, మనసులో బద్ధవైరం పాతుకుపోయిందీ రవిపట్ల. కమల మరణంతో యీ వైరం చల్లబడుతుందని నమ్ముకుంది. ఒక్కసారి కూడా రవి చిత్రాలకు చేయూత నివ్వలేదు. పైగా, కళా ప్రపంచంలో రవికాక అజేయమైన స్థానముందనీ, దాన్నెలాగైనా నాశనం చెయ్యాలనీ, భాష్యంగారి పట్టుదలెక్కువైందీ మధ్య.

ఆయన చేతిలో ఒక కప్పు కాఫీ తెచ్చిచ్చి, లోపలికెళ్ళింది శాంత. అతనితో యిక మాట్లాడబుద్ధి కాలేదని వేరే చెప్పాలా! అయినా అతనికి రవి చిత్రం - ఈమధ్య గీసింది - చూపించి తీరాలి....

"రామూ! మొన్న రవీ మామ మీకిచ్చిన బొమ్మేదీ?"

"దేవుడి పటాల దగ్గర పెట్టిందమ్మ. నాన్నగారికెంతో బాగుంటే, అలా చేయమన్నారట. అయినా నాకిచ్చిన బొమ్మ, అమ్మా నాన్నా లాక్కోడం అన్యాయం కాదక్కా?"

దేవుడి మంటపం దగ్గరికెళ్ళి చూసింది శాంత. అద్భుతం! "కచ దేవయాని!" బ్రహ్మాండంగా వుంది! చిద్విలాసంగా సూర్య చంద్రాదులతో వెలుగుతున్న విశాలాకాశంలో, యే మూలో మాటు

మణిగిన చిన్న తారలా, చిత్రం అడుగున సన్నగా సంతకం చేశాడు చిత్రకారుడి పేరు

"రవి"

"ఓసారి లోపలికొచ్చి, మా తమ్ముడికి మీ 'బావగారు' ప్రెజంట్ చేసిన చిత్రం చూస్తారా" అంటూ పరుగున దేవుడి మంటపం దగ్గర్నుంచి డ్రాయింగ్ రూమ్‌లోకి పరిగెత్తుకొచ్చింది శాంత!

భాష్యం లేడు.

ఎప్పుడో లేచిపోయాడు!

కమల పరలోకగతం కాకముందే "బావా" అని పిలవడం అరుదు, రవిని. పసివాళ్ళు నోరారా "రవి మామా!" అని పిలుస్తుంటే,సహించలేని ఈర్ష్యాగ్ను లతనిలో రగులుతున్నాయని గ్రహించింది శాంత. తనలోతను బాధపడుతూ అనుకుంది-

"భస్మీభూతమైనా, వజ్రాల్లా తేజస్సును విడని జీవితాలెన్ని లేవు!" ఊహల అగ్నిగుండంలో మగ్గుతున్నా, లొంగని రవి పేరు తల్చుకున్నప్పుడల్లా శాంత వర్చస్సులో మెరిసే మంద హాసాని కంతరార్థమేమో ఇది! ఇప్పుడు రోజూ అతనిదగ్గర చిత్రలేఖనం నేర్చుకుని వస్తుంది. పాపికొండల కరకు రాళ్ళ హృదయాల్లో, పాలరాతి 'నిగ' 'నిగ'లు పొదిగే ఉన్మనతా, గర్జించే సింహపు భీషణాకృతిలో గోముఖ ప్రసన్నత దిద్దే చాక చక్యమూ, రవి పట్టుదలతో నేర్పుతున్నాడామెకు. "మీరు" అని పూర్తి చెయ్యాలనుకున్న వాక్యాల్లో తడబాటు చూసి నవ్వుకునేది మొదట్లో. "రవీ!" అని పేరుపెట్టి పిలవడానికి పెదిమలు కదలడంలా ఇంకా! అభిమానాన్ని మించిన వ్యక్తావ్యక్తమైన మధురభావమేదో ఆమెను "పీడిస్తున్న" దనడానికి సంసిద్ధులం కావచ్చు. కానీ బాహ్యంగా ఒప్పుకోదామె! రవి గదిలో, తుడిచీ తుడవనట్లు అతికిన దుమ్ము నూదుతూ, పుస్తకాల బీర్వామీద అతికించిన చిత్రాన్ని ప్రశంసిస్తుందొకనాడు.

"ఎంత బావుందబ్బా! ఏ కొద్దిమందికో దత్తవరాలిలాంటివి!"

"కొంచెం ప్రమిదలు తుడిచి దీపాలు వెలిగించిపోదురూ. నూనె ఒలకబోసుకున్నా.... చాతగాని వ్యాపరం... కాస్త సహాయం చేద్దురూ!"

"చేద్దురూ" - అనకండి. "చెయ్ శాంతా" అంటే చేస్తాను!" చిలిపిగా జవాబిస్తుంది శాంత....

-పిచ్చిమనిషి!! అసలు కళాకారులంతా పిచ్చివాళ్ళే స్వతః!-

"చీకట్లో కూచోడం మానండింక." శాంత పుణ్యమా-అని గదిలో దీపాలు మళ్ళీ వెలుగుతున్నై!

అన్నా చెల్లెళ్ళులా వారిద్దరూ మెలిగిన దినాలు లెక్క పెడదామనుకుంటుంది. ఏకోదరత్వానికి భంగంగా పలికిన యే ఒక్క ముక్కో జ్ఞాపకం తెచ్చుకుని ఆమె ముడిచిన వేలు పైకి తీయిస్తుంది. విశిష్ట ప్రేమకు రూపం లేదని వాదిస్తారామెలోంచి ఎవరో!

కొన్నాళ్ళుగా రవి కూడా తనకు తెలియకుండానే శాంత లోని సహృదయాన్ని తొంగిచూస్తున్నాడు! భార్య పోయినప్పటి నుంచీ అపావృతమైన పథాల్లో యేకాకిగా నడుస్తున్న అతని కిప్పుడు "తోడెవరూ లేర"ని భయం వేస్తున్నదేమో, అధీనునిలా ఆధారాని కెదురుచూస్తాడు! ఈ ఆశ తనకు కల్పించిన శాంత ఇంటికి వెళ్ళిపోయాక, పోయిన పంచమినాటి మసక వెన్నెట్లో చుక్కల్ని లెక్కపెడుతూ అనుకున్నదే ఒక్కసారే, అతను-

"నేను కమలను మరిచిపోలేదు కదా!!"

చరిత్ర తిప్పి తిప్పి పాత పేజీలు తిరగేస్తుందంటారు. కమల కూడా శాంతలాగే ఒకనాడు అపరిచితురాలు. మర్నాడు తన కళలో తీపి చూపిన శిష్య. మరికొన్నాళ్ళకు ధర్మపత్ని! భావుకుడైన తను, ఇల్లాగే, చేసిన తప్పే చేస్తూ, జీవితం గడుపుతుంటాడా!?

ఈ సందేహం కలగడం, ఇదే అతనికి మొదటిసారి.... రాసిన తప్పును కొట్టేస్తున్నట్టు, గాలిలో వంకరగా చేయి విసిరాడు

"ఛీ.... ఎప్పటికీ కాదు...."

సాయంకాలం కారులో షికారుకు రమ్మంటుంది శాంత. నిక్కచ్చిగా 'వద్ద'ని అడ్డు చెప్పినరోజూ కద్దు. 'రాలేన'ని మెత్త బడిన దినమూ కద్దు.... నిజంగా షికారుకెళ్ళిన దినం మాత్రం కనిపించదు. ఎంత చనువుగా వర్తిస్తున్నా, చిన్న విషయాల్లో స్త్రీని నొప్పించడం పరిపాటీ కాదని రవికి తెలియదేమోనని విచారించేది శాంత....

"ఆకాశమంత కళాతజ్ఞత ఇమిడిన బుర్రలో, యీపాటి చిన్న విషయానికి తావు లేదా!?" అన్న సందేహం ఆమెకు లేక పోలేదు.... లౌకికుడు కాదని తెలిసీ, పట్టుబట్టడం ఆమెదే లోపంగా గ్రహించుకుని, షికారుకు పిలవడమే మానేసింది.

వెలుగునిస్తున్న కొవ్వువత్తి తనలో తానే దిగజారుతున్నది.... మైనంలా శూన్యంపైపుకు బొట్లుబొట్లుగా కారుతోంది కాలం!

* * *

శాంతను చూస్తూ సర్వావసరాలూ మరిచిపోగల స్థితి వచ్చిందిప్పుడు రవికి! ఆమె దగ్గర లేండే, చిత్రం తీయడాని కుపక్రమించనేలేదు! ఎప్పుడో తాను మొదలుపెట్టిన "స్వప్న సుందరి" చిత్రాన్ని పూర్తి చేయడానికి కుంచె అందుకుంటే యెవరో ఛాయగా తన్ను పలకరించి, కలవరపడుతూ మాయమౌతున్నట్టు కలలు గంటాడు!

"అలసి వచ్చారు.... కొంచెం విశ్రాంతి తీసుకోరూ.... ఏమిటలా చూస్తారూ... నేనే.... మీ క....మ....ల....ను...."

ఇంకో స్థితి ఇది!!!

కానీ—

రాను రానూ రవికీ అంతర్వాణుల్లో అభిమానం తగ్గుతోంది. ఎవరో లోపలనుంచి వాగి వాగి విసిగి మానేసినట్టు, ఆట్టే బలంలేని అనుమానాస్పదమైన భావన మిగిలిపోయిందంతే....

"రవిగారూ!"

పోష్టువాడు!

"అవును. ఇవ్వండి"

ఎక్స్‌ప్రెస్ ఉత్తరం.

ఎప్పుడో మరిచిపోయిన దస్తూరీ చూడగానే ప్రాణం లేచి వచ్చింది. స్వగ్రామాన్ని, ఇంటినీ, ఇంటికి వేసిన కప్పునూ బహుశా మరిచిపోగలిగాడేమో కాని, అందులో నివసించే తల్లీ, తండ్రీ, చెల్లెలూ కనుపాపల్లో మెరిశారా ఉత్తరం చూడగానే....

విప్పి చదువుతున్నాడు....

విశాలమైన నుదురంతకంతకూ ముడిబడుతున్నది.... రెండు కళ్ళల్లోంచి గంగా యమునలు కారుతున్నై....

వేళ్ళమధ్య ఉత్తరం బెదురు చూపులు చూస్తున్నది.

ఉత్తరం మూస్తూ - అలసిన ప్రయాణీకుడిలా.... బాణం తగిలిన ఆడలేడిలా, కూలబడి ఒక్క నిట్టూర్పు విడిచాడు....

"మమతలు!.... మందులు!.... వెయ్యి రూకలు!.... అబ్బా!....

తండ్రి తీవ్ర వ్యాధిపాలైనాడు. చెల్లెలికింకా పెళ్ళి కాలేదు. తమకు లేని బెడద సంఘానికి పట్టింది! రవి పెళ్ళికిగాను చేసిన అప్పు వడ్డీతోసహా కొండల్లా పెరిగింది. రోజూ దమ్మిడీ ఆదాయం లేని మూడు జీవాలకూ తిండి ఖర్చులో మరి! ఇలా, రానూ రానూ, తన తాత ముత్తాతల కాలంనుంచీ తమ కాశ్రయమిచ్చిన కుటీరం తాకట్టుకింద పోతున్నదట! కడసారిగా, 'కొడుక'న్న సంబంధం సార్థకం చేసుకోమనీ, ఒక వెయ్యి రూపాయలైనా సాయం చేయమనీ, అలా చేస్తే "బహుశా, మీ నాన్నగారి ఆఖరు క్షణాలైనా శాంతంగా గడుస్తాయేమో!"ననీ ఆ లేఖలో రవి తల్లి కన్నీళ్ళు కారుస్తూ ఉదహరించింది....

"ఇంతకూ నువ్వు బాగున్నావా నాన్నా.... మా కోడలు నన్ను జ్ఞాపకం చేసుకుంటుందా.... పిల్లలెందరు.... కమలను మరీ మరీ "అడిగా"నని చెప్పు...." ఎన్నెన్నో రాసిందమ్మ!

కొవ్వొత్తి కరిగి నేల కొరిగింది....

సగం పూర్తయిన "స్వప్న సుందరి" చిత్రంపైపు చూస్తూ, నిట్టూర్పు విడిచాడు రవి "నీవే నన్ను రక్షించాలి.... నా కుటుంబానికి పునర్జన్మ ప్రదానంచేసి పోషించాలి...."

కార్యదీక్ష భూతంలా ఆవేశించింది! సంయమికి మించిన మనోబలం తాండవిస్తున్నది భృకుటి వంకరలలో!

"జమీందారుగార్ని డబ్బడిగి లాభం వుండదు. శాంత నడగనే అడగను. నా చిత్రం నా కుటుంబాని కన్నదాత కావాలిప్పుడు...."

మధ్యాహ్నం శాంత వచ్చినా పాఠాని కుపక్రమించలేదు.

"శాంతా! ప్రదర్శనం మాటేమిటీ?"

"మరో పక్షం రోజుల్లో జరగవచ్చు. కానీ—" శాంత మాట పూర్తికాకుండానే అంటున్నాడు "నా చిత్రాలు పంపుతున్నా. డబ్బిస్తారా?" అతని అమాయకత్వం రోజుకు రోజూ పెరుగుతున్నట్టు చూస్తూ, గుండె చెరువవుతోంది శాంతకు.... మెల్లగా అంది

"డబ్బెంత.... అవసరమయితే... నేనే-"

"కాదు నా "స్వప్న సుందరి" నన్ను రక్షించి తీరాలి. భాష్యం 'బావ' ఒప్పుకుంటాడా?"

భాష్యం బావ!! రవి జీవితంలో మొదటిసారిగా, భాష్యం-'బావ'గా ఆప్తుడై మారడం శాంత గుండెల్లో తుపాకి గుండులా

వేలింది! "జవాబేం చెప్పాలా" - అని సందేహిస్తున్నది శాంత. ఇంతలో రవి ఆదుర్దాగా అన్నాడు "సంస్థానాధీశ్వరు లెవరో చిత్రాలు చూడ్డానికీ, కొనడానికీ వస్తారుటగా"

ఆలోచించింది.

మళ్ళీ ఆలోచించింది.

అతని సుఖమే తన సుఖమిప్పుడు....

"అవును పంపించండి.... నేను కూడా మీరు నేర్పిన చిత్రాలు కొన్ని పంపుతా"

"ఓ! అంతకన్నా ఏం కావాలి! ముందు నా "స్వప్న సుందరి" చిత్రం 'ఖిర' 'ఖిరా' పూర్తి చేయాలి!"-

విగ్రహంతో లేచి, అక్కడ శాంత వున్నదని కూడా మరిచిపోయి రంగులూ, కుంచే యేకత్రితం చెయ్యడం మొదలెట్టాడు రవి! మరణశయ్యమీది నుంచి తండ్రిని బ్రతికించాలి.... అప్పుకింద పోనున్న కుటీరాన్ని దక్కించుకుని తీరాలి.... అబ్బ! ఎందరు తల్లిదండ్రులలా సంసార సాగరంలో - యీ దేశంలో- తల్లడిల్లిపోతున్నారో! అమ్మ రాసిన ఒక్క ఉత్తరం, తనలో ఎంత మార్పును తెచ్చిందీ!! అసలు చిత్రాల ద్వారా డబ్బు సంపాయించాలన్న ఆశ కలగడం రవి కదే మొదటిసారేమో!! "అమ్మ!!" ...."అసలు కమల పోయిందని కూడా తెలీదామెకు పాపం!"

* * *

మళ్ళీ వీధిలో తుపాకుల మోత!!

అలవాటుపడ్డా, కలవరం తగ్గలా ఇవ్వాశెందుకో!

"భగవంతుడా! నీవు సృష్టించిన లోకాన్ని నీవే, లేనిపోని కల్లోలాలతో నాశనం చేస్తావెందుకయ్యా! పోనీ....ఒఖ్ఖ మనవి.... జీవితంలో యేవో కొత్త ఆశల నంకురింపజేశావ్.... మళ్ళీ అడుగులోనే హంసపాదులు రాకుండా రక్షించు దేవా!...."

ఏమిటో.... ఎన్నెన్నో పిచ్చి ఆలోచనలు....!!

* * *

ఎవరో తలుపు కొట్టారింతలో.

"ఎవరది?"

"ఒక్కసారి తలుపు తీస్తారా?"

ఎవరో కొత్త గొంతు!

"ఎందుకూ?"

"చెప్తాను తీద్దురూ...."

తలుపు తీశాడు.

పక్కింటి పంతులు!

ఊసుపోని దినాల్లో అడపా దడపా రవి ఇతనితో మాట్లాడేవాడు కమల బతికున్న రోజుల్లో. అది వీరి మిత్రత్వం కాదు- వుత్తి ముఖపరిచయం మాత్రమే. అతని పాత సంభాషణల వల్ల రవి ఊహించుకున్న విషయ మొక్కటే-

"పని చేయలేని మాటకారి" అని! అంతకన్నా గ్రహించ దలుచుకోలేదేమో అసలు....

"ఈ సామాన్లు మీ ఇంట్లో వుంచనివ్వండి కొన్ని దినాలు. బయట దొంగలమయం కదూ.... మా అన్నగారికొంట్లో బాగ లేదట! తెలంగాణా వెళ్ళివస్తా. ఊర్నించొచ్చాక తీసుకుపోతా లేండి.... మీకేమీ ఇబ్బంది కలిగించను."

'కాద'నడం చేతగాదు రవికి!

"అల్లాగే"

పెట్టె వుంచి, కనీసం 'థాంక్స్' అని కూడా చెప్పకుండా వెళ్ళిపోయాడతను.... పాము కరిచినా చెప్పి కరుస్తుందంటారు!

హడావిడిగా ఇలా జరగడం గమ్మత్తుగానే వుంది రవికి! ఏమి దాచివెళ్ళాడో తన కనవసరం గనక అతడు తిరిగి వాటి విషయం ఆలోచించడం మానేశాడు.

"స్వప్న సుందరి" పూర్తిచెయ్యాలి. ఇప్పుడు జీవితాని కదొక్కటే ధ్యేయం.... తలుపు వేసేశాడు....

నిద్ర రాకున్నా కలలు కంటున్నాడు మళ్ళీ!-

కలలే కుంచె నాడిస్తున్నాయి!!

కలలే భూత భవిష్యత్తులకు పునాది!!

* * *

బ్రహ్మాండమైన ప్రయత్నాలు జరుగుతున్నై 'ఎగ్జిబిషన్'ను విజయవంతం చేసేందుకు. పరుల పలుకుబడి తనదిగా చేసుకోగల మధ్యవర్తిత్వపు కీలకాలెన్నో సాధిస్తారు 'అతి' లోకజ్ఞానం గల చతురులు! భావ్యం సిద్ధహస్తుడీ విషయంలో. ఈ చిత్ర ప్రదర్శనం యేర్పాటు చేయడం మూలంగా, ముక్తీ రక్తీ చూడందతనికి నిద్ర రాదు. "గొప్పవార"మని భ్రమపడుతున్న చిత్రకారుల నెందరినో పిలిపించాడు. ఉన్నతస్థాన మలంకరింపించాడు గోడలమీద వారి చిత్రాలను. రవిని పిలవడానికతని నోరాడనే లేదు. 'ఫ్రీ' అన్న